# ముసలమ్మ వుత్తరం

శ్రీ బొద్దనపల్లి
యజ్ఞనారాయణశర్మ

ముసలమ్మ, కరణంగారు, చుట్టం రామయ్య, పెద్దమనుష్యులు, టపాబంట్రోతు, పొరుగామె సుబ్బమ్మ.

## 1

(ముసలమ్మ యిల్లు: సుబ్బమ్మ, ముసలమ్మ కూర్చుని వుంటారు.)

సుబ్బ: చెట్లపాదులన్నీ ఎండిపోయినట్లున్నా యేం అప్పా?

ముస: ఎండిపోక యేముందే. ఆటి మొఖాన, నా మొఖానా నీళ్లెవరు బోస్తారు? అబ్బాయేమో, వూడ్పులుగారూ మరి! ఆ తుమ్మలపల్లి యవసాయం మండబెట్ట బోయ్యాడు. కోడలేమో పుట్టింటికాడ అములు మండబెట్టబోయింది.

సుబ్బ: అయ్యో! అదేంటమ్మా! ముసిలి ముండవు. నీమీద సంసారం పారేసిపోవడమేంటి? పోనీ ఆ పసికూనల్ని గూడా తీసుకుబోతేయేం?

ముస: అమ్మా! ఎవరికి వారు సొతంత్రులు. ఎవరు చెపుతారు? అది ఆడింది ఆట, పాడిందిపాట. పిల్లలు వెంటుంటే దాని ఆటలు సాగవుగా మరి! ఇంతకీ, ఏమిటో నేను కొస్తా గుటుక్కు మనకూడదూ సుబ్బమ్మతల్లీ; నమ్మ నమ్మకపో, పదిమంది కట్టేన కొంపలో వుండి చెపుతున్నా. నేనీ యాతన్లు పడలేను తల్లీ! ముక్కు మూసుకుంటె మూడుఘళ్లు.

సుబ్బ: కొడుకూ, కోడలూ వున్న నువ్వే యిదయితే, బిడ్డా పాప లేనిదాన్ని నేనేమనుకోవాలి?

ముస: అబ్బాయైనా వస్తాడేమో నను కుంటే, వాడూ రాలేదు. పిల్లలు బొత్తిగా కూడుగూడా తింటల్లా.

సుబ్బ: అన్నాల్తిన్నారా? అప్పా.

ముస: వూ! ఏం అన్నం? వుత్త మజ్జిగాన్నం తప్ప యేమీ పోదు; పిల్ల లెక్కడికో వెళ్లారు. వాళ్లు రాంగానే తినాలి.

సుబ్బ: అన్నం తిని వస్తాలే అప్ప! యిప్పుడే వండాను; ఏం జేస్తున్నారో చూసిపోదాం అని వచ్చా!

ముస: పోయిరా అమ్మా,

(సుబ్బమ్మ వెళ్లిపోతుంది. ఇంతలో చుట్టం రామయ్య వస్తాడు).

ముస: ఏం? నాయనా? యింటిదగ్గర్నుంచేనా?

రామ: అవునమ్మా! యివ్వాళ గన్నారం కోర్టులో మావూరు కేసు వాయిదా వేశారుగాదూ; మావాళ్ళంతా ముందు బోతున్నారు. కాసిని మంచినీళ్లియ్యి, పిన్నమ్మా. తాగిపోతాను.

ముస: అదేమిటి నాయనా! అన్నం దినిపోదుగాని వుండు. యింకా మేంగూడా తిన్లా. (అని మంచినీళ్ళు తెచ్చియిచ్చింది)

రామ: ఒదిన పిల్లలు యింకా రాలేదేమిటే?

ముస: యింతవరకు జాడ జాబూ లేదు. అన్నట్టు నాయనా! ఒక వుత్తరంముక్క రాసిపెట్టుబాబూ. మీ వదినవాళ్ళని రమ్మని. (అని కాగితం, పెన్సలు యిస్తుంది. అలాగే రామయ్య వ్రాసి ముసలమ్మకు యిస్తాడు).

రామ: వెళ్ళొస్తా పిన్నమ్మా! వాళ్ళు చాలా దూరం పోయివుంటారు.

ముస: నీయిష్టం రెండు మెతుకులు తిను నాయనా అ‿‿నవు. (రామయ్య వెళతాడు. ముసలమ్మ పంపించడానికి దర్వాజాదాకా వెళ్తుంది. టపా బంట్రోతు ఆదారే పోతూవుంటాడు).

ముస: ఇదిగో! ఓ పోస్టబ్బాయ్! ఓపోస్ట బ్బాయ్! నాయన్నాయనా! యిటు పిలువు ఆ పోస్ట......, ఆ! నేనే నాయనా పిల్చింది. ఒక్కసారి మా యింటికి రాబాబూ!

పోస్టు: అమ్మా! ఎందుకు పిల్చారూ!

ముస: (తెల్లకాగితంమీద వ్రాసిన వుత్తరం తెచ్చి) నాయనా! ఇది కాస్త మా అమ్మాయిగారివూరు పంపించు నాయనా. నీకెంతైనా పుణ్యముంటుంది.

పోస్టు: ఇదేమిటమ్మా! యీ కాగితంఎలా పంపించడం? రెండు అణాలు తీసుకుపోతే, మా ఆఫీసులో కవరని, ఒక సంచిలాటిది యిస్తారు. దానిలో యీ వుత్తరం పెట్టియిస్తే పంపుతాం.

ముస: రెండణాలు బెట్టి సంచెందుకు బాబూ? మా అబ్బాయి పుస్తకాలసంచీ వుంది. దాల్లో పెట్టి తీసుకుబోయి మళ్లా తీసుకురా.

పోస్టు: నేను గాదమ్మా, తీసుకుపోయేది. అసలు ఆసంచి పనికిరాదు.

ముస: ముసిలిముండను జేసి కాజేద్దామనుకున్నావా? రెండణాలు. మూడు నిన్నేం జేస్తానో

(ఇంతలో కొందరు పెద్దమనుష్యులు చేరతారు.)

ఒక పెద్దమనిషి: ఏమిటి ముసలమ్మా! అదిగాదు. ఆ అబ్బాయి చెప్పిందే రైటు. బేడా కాకపోతే మూడుకాన్లు బెడితే కార్డు వస్తుంది. దానిమీద వ్రాసి పోస్టులో వెయ్యాలమ్మా! (పోస్టుమాన్‌తో) ఆ ముసలమ్మకు తెలియదులే బాబూ నీవెళ్లు.

ముస: అట్టాగా. సరేలే నాయనా! అనక తెప్పిస్తాలే కారుడు. (అందరూ వెళతారు. సాయంకాలానికి కార్డు తెప్పిస్తుంది.)

## 2

(కరణంగారి యిల్లు. వ్రాసుకుంటూ వుంటాడు. ముసలమ్మ కార్డు తీసుకుని నిల్చుంటుంది)

కరణం: ఏం ముసలమ్మా! ఏం పనిమీద వచ్చావు?





ముస : మాకోడలు పుట్టింటికి వెళ్లింది. కాస్త వుత్తరం వ్రాసిపెట్టండి బాబూ.

క : ఇట్టే కార్డు. మీ కోడలు పేరు?

ముస : రామసుబ్బమ్మండీ.

క : ఏవూరు?

ముస : నూరంపల్లిబాబో.

క : ఆవూళ్ళో పోస్టాఫీసుందా?

ముస : లేకేం. మా ఆచార్లుగారి అంజయ్యగారే పోస్టులో వుంటేది.

క : ఆ! ఏమిటి కబుర్లు.

ముస : నువ్వెళ్లిన కాణ్నించీ వర్షాలు లేక చెట్లపాదులు వాడిపోయినయ్.

క : (వ్రాస్తూ) ఆ తర్వాత?

ముస : నువ్వెళ్లినకాణ్నించి తిండీ తిప్పలు తినక పిల్లలు బొత్తిగా యిట్టా అయిపోయినారు. (మనం సామాన్యంగ బక్కచిక్కిపోయినాడని చెప్పడా। చెయ్యి వేళ్ళన్నీ ముడిచి చూపుడు వేల మాత్రం ఇటు అటు ఆడిస్తాం. అల్లా ముసలమ్మ వేలు చూపిస్తుంది.)

క : (వ్రాస్తూ) ఆ తర్వాత?

ముస : ఏంరాశారు బాబూ.

క : నువ్వెళ్లిన దగ్గరనుంచీ, పిల్లలు తిండి తినక బక్కచిక్కిపోయినారు. (అని చదువుతాడు)

ముస : చిక్కిపోవడంగాదు బాబూ। బొత్తిగా యిట్టా అయిపోయినారని రాయండి (అని మళ్లీ వేలుచూపిస్తుంది)

క : దాని అర్థమే యిది. నువ్వు వేలు చూపిస్తే యిందులోగూడా వేలు చూపిస్తున్నావని వ్రాయనా? అట్లా వ్రాయడం తప్పు. కుదరదు.

ముస : అదేమిటిబాబూ! నేచెప్పినట్టు రాయండిబాబూ.

క : అంతేనమ్మా! నువ్వు చెయ్యిచూపితే చెయ్యి, తల చూపితే తల యిందులో బొమ్మ వెయ్యమంటావా? ఎవరు వ్రాసినా యింతే. తర్వాత?

ముస : తరవాత......బొత్తిగా గొడ్లు పట్టుమని (సామాన్యంగా మనం యింత పరిమాణం అని రెండు చేతుల్తో చూపించుతాం. అలాగే చూపిస్తూ) యింతమేతైనా తినడంలేదు.

క : ఆ! తర్వాత?

ముస : ఏంరాశారుబాబూ!

క : గొడ్లు మేత బొత్తిగా ఏమీ తినడం లేదు.

ముస: మళ్ళా అట్టాగే రాశారేంబాబూ! పట్టుమని యింతైనా తినడం లేదని రాయండీ! బాబూ!

క : దాని అర్థం అదేనమ్మా! నీకు వుత్తరం వ్రాయడం నాకు చేతగాదు. ఎవరిచేతనైనా వ్రాయించుకోపో (అని కసురుకుంటాడు)

ముస : లేదులేబాబూ! బాబూ వ్రాయండి. (బతిమలాడి) ఇక్కడ చాలా యిబ్బందిగా వుంది, గేదెలు పట్టుమని యిన్ని పాలైనా యివ్వడంలేదు. కనుక వెంటనే రమ్మని వ్రాయండి (అని చేర చూపిస్తూ అంటుంది.)

క: అమ్మయ్యా! నీకు వుత్తరం వ్రాయడానికి నీ భాష ప్యాసయి రావాల్సిందే గానీ, ఇతరులికి చేతగాదు. పో అమ్మా! యిహపో. నాప్రాణం తీశావు. ★